సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 26 । అక్టోబర్ । 2023



విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి ఉత్సవ మూర్తులకు బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు.



మెట్రో ముందడుగు

విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. 8లో

గుళి రాగు.. దిగుబడి భళి

- కలిసొచ్చిన ప్రకృతి వ్యవసాయం
- ఆశాజనకంగా రాగుల పంట
- జిల్లాలో 8500 ఎకరాల్లో సాగు
- కోతలు ప్రారంభం



గుళి పద్ధతిలో కిల్లోగూడలో సాగుచేసిన రాగుల పంట



ప్రకృతి వ్యవసాయ అధికారుల సమక్షంలో పంట కోతలు

సాక్షి,పాడేరు: ప్రకృతి వ్యవసాయంపై జిల్లా రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం, జిల్లా వ్యవసాయశాఖ, పలు స్వచ్ఛంద సంస్థల కృషితో జిల్లా వ్యాప్తంగా 'గుళి రాగు' విధానంలో సాగుచేస్తున్న రాగుల పంట విస్తీర్ణం ఈ ఏడాది భారీగా పెరిగింది. నాట్ల వరుసల మధ్య ఎక్కువ అంతరాన్ని ఉంచి సాగు చేస్తే ఆ విధానాన్ని గుళి రాగు పద్ధతి అంటారు. ఈ ఏడాది 8,500 ఎకరాల్లో జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతులు ఈ పద్ధతిలో రాగుల పంటను సాగుచేశారు. రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న ప్రకృతి విధానంలో గిరిజన రైతులు ఈపంట సాగు చేసి మంచి ఫలితాలు సాధిస్తున్నారు.గతఏడాది ఖరీఫ్‌లో 3,600 ఎకరాల్లో సాగుచేయగా, ఈఏడాది సాగును భారీగా విస్తరించినట్టు ప్రకృతివ్యవసాయ విభాగంతెలిపింది.

ఆశాజనకంగా పంట

గుళి రాగుల పంట ఈఏడాది కూడా ఆశాజనకంగా ఉంది. దుక్కిపనుల నుంచి నారు తయారీ, నాట్లు, మొక్కల మధ్య ఎక్కువగా అంతరం ఉంచడం, ఘన,ద్రవ జీవామృతాలు వినియోగం తదితర పద్ధతులను గిరిజన రైతులు తూచా తప్పకుండా పాటించడంతో పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉంది. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో గిరిజన రైతులు పంటకు సస్యరక్షణ పనులు చేపట్టారు.

కోతలు ప్రారంభం

గత ఏడాది వలే ఈసారి కూడా అధిక దిగుబడులు వస్తాయని గిరిజన రైతులు ఆశిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేసిన ప్రాంతాల్లో కంకులు విరగ్గాశాయి. దీంతో ప్రకృతి వ్యవసాయ అధికారులు, ఎన్‌జీవో సంస్థల ప్రతినిధుల సమక్షంలో పంట కోతలను గిరిజన రైతులు ప్రారంభించారు. గత ఏడాది డుంబ్రిగుడ, అరకులోయ, ముంచంగిపుట్టు, హుకుంపేట, జి.మాడుగుల, పాడేరు ప్రాంతాల్లో ఎకరానికి 17వేల క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈఏడాది కూడా పంట ఆశాజనకంగా ఉండడంతో ఆ స్థాయిలో దిగుబడులు వస్తాయని గిరిజన రైతులు తెలిపారు.

సాగు విస్తీర్ణం పెంచాం



ప్రకృతి వ్యవసాయం ద్వారా గుళిరాగుల పంటపై జిల్లాలో గిరిజన రైతులకు అవగాహన కల్పించాం. గత ఖరీఫ్‌లో 3,600 ఎకరాల్లో సాగు చేయగా, ఈఏడాది 8,500 ఎకరాలకు సాగు విస్తీర్ణం పెంచాం. గుళిరాగు పద్ధతి ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు నాణ్యమైన రాగులను గిరిజన రైతులు పండిస్తున్నారు.

– భాస్కరరావు,
రైతుసాధికార సంస్థ జిల్లా మేనేజర్

సక్రమంగా పన్ను మదింపు

కలెక్టర్ సుమిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలో ఇటీవల పెద్ద ఎత్తున నిర్మాణాలు జరిగాయని, వాటికి పన్నులు వేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ పరిధిలో సర్వే నిర్వహించి పన్నులు వేయని ఆస్తుల వివరాలను సేకరించి, సరైన రీతిలో పన్ను మదింపు చేసి, నోటీసులు జారీ చేయాలని తెలిపారు. వాటిపై వచ్చిన ఫిర్యాదులను తగు రీతిలో పరిష్కరించాలని సూచించారు. పూరిగుడిసెల్లో ఉన్న వారికి పన్ను మినహాయింపు ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది రెండుపూటలా ముఖహాజరు తప్పనిసరిగా వేసి, నివేదించాలని ఆదేశించారు. పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రపరచాలని తెలిపారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జనన మరణ ధ్రువీకరణపత్రాల జారీ త్వరితగతిన చేయాలన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద అవసరమైన వారికి పని కల్పించాలని సూచించారు. 150 పనిదినాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేతనదారులకు బ్యాంకు ఖాతాలు తెరవడంలో అడ్డంకులను పరిష్కరించాలని ఆదేశించారు. జాబ్‌కార్డుల జారీ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. తమకు జాబ్‌కార్డులు ఉన్న విషయం కొంతమందికి తెలియడం లేదన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్, డీబీటీ మేనేజర్ నరేష్, ఐటీడీఏల నుంచి ప్రాజెక్టు అధికారులు, వి.అభిషేక్, చైతన్య, మండలాల నుంచి ఎంపీడీవోలు, ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర గవర్నర్ విశాఖ రాక రేపు



మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 27న విశాఖ వస్తున్నారు. గన్నవరం నుంచి విమానంలో సాయంత్రం 4.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా నొవోటెల్ హోటల్ చేరుకొని అక్కడే బస చేస్తారు. 28న ఉదయం 11 గంటలకు విశాఖ విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కి స్వాగతం పలుకుతారు. ఉపరాష్ట్రపతితో నేరుగా ఆంధ్ర మెడికల్ కాలేజీకి 11.30 గంటలకు చేరుకొని మధ్యాహ్నం 1.05 గంట వరకు అక్కడే ఉంటారు. అనంతగరం గవర్నర్ నొవోటెల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకుంటారు. సాయంత్రం 3.55 గంటలకు విశాఖ విమానాశ్రయంలో ఉపరాష్ట్రపతికి వీడ్కోలు పలుకుతారు. 4.35 గంటలకు గన్నవరం బయలుదేరుతారు.

28న మధ్యాహ్నం 2.30 గంటల వరకే అప్పన్న దర్శనాలు

సింహాచలం : చంద్రగ్రహణం కారణంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలు ఈనెల 28న మధ్యాహ్నం 2.30 గంటల వరకు మాత్రమే లభిస్తాయని ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. తిరిగి 29న ఉదయం 8 నుంచి దర్శనాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 28న అర్ధరాత్రి దాటాకా 1.07 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభమై 2.36 గంటల వరకు ఉంటుందన్నారు. గ్రహణం కారణంగా 28న రాత్రి ఆరాధన, 29న ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, స్వర్ణపుష్పార్చన, గరుడసేవలు రద్దు చేసినట్లు తెలిపారు.

మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం



మర్రిపుట్టు గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర



భవనం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ మర్రిపుట్టులో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే ఫోన్ చేసి తనకు చెప్పాలని కోరారు. గ్రామంలో తాగునీరు, డ్రైనేజీ, రోడ్డు సమస్యలున్నట్టు స్థానికులు తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. మర్రిపుట్టులో సీసీరోడ్డు, డ్రైనేజీలను నిర్మిస్తామని చెప్పారు. అంతకు ముందు ముంచంగిపుట్టు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (గోదాం) భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ గోదాం నిర్మాణం జరిగితే.. మద్దతు ధర వచ్చే వరకు రైతులు తాము పండించిన పంటల ను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతుల సంక్షేమానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వెలుగు ఏపీఎం దేవమంగ, సర్పంచ్‌లు వెచ్చంగి సుభాష్‌చంద్ర, భాగ్యవతి, తిరుపతిరావు, రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జగబందు, నాయకులు మూర్తి, తిరుపతిరావు, రాజారావు, కూడ మత్స్యలింగం, దామోదరం పాల్గొన్నారు.

నేవీ ఎస్ఎస్‌సీ ఆఫీసర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సింధియా(విశాఖ పశ్చిమ): ఇండియన్ నేవీ షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు 2024 జూన్‌లో కోర్సులో చేరాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అవివాహిత పురుషులు, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. దరఖాస్తు గడువు ఈ నెల 29వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. వివరాల కోసం అక్టోబర్ 21వ తేదీ నాటి ఎంప్లాయిమెంట్ న్యూస్ ప్రకటనను చూడాలని పేర్కొన్నారు. అభ్యర్థులు http:// joinindiannavy. gov. in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వివరించారు.

టాంకోటలో ప్రత్యేక వైద్యశిబిరం

ఐటీడీఏ పీవోకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



టాంకోటలో వైద్యసేవలు అందిస్తున్న పినకోట వైద్యాధికారి వెంకటేష్

అనంతగిరి: మారుమూల పెదకోట పంచాయతీ టాంకోట గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పినకోట పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. టాంకోట గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతున్నట్టు ఐటీడీఏ పీవో అభిషేక్‌కు సమాచారం అందడంతో ఆయన వెంటనే స్పందించి డీఎంహెచ్‌వో జమాల్‌బాషాకు తెలిపారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకుని వైద్యసేవలందించారు. వైద్యసిబ్బంది ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, హెచ్‌ఈ రవి, ఏఎన్ఎం శ్రావణి, హెల్త్ అసిస్టెంట్ రాంబాబు పాల్గొన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసేందుకు చొరవచూపిన ఐటీడీఏ పీవో అభిషేక్‌కు టాంకోట గ్రామ గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న కానిస్టేబుళ్లు

రంపచోడవరం : పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం పోలీసులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ క్రైం, సోషల్ మీడియా అంశాలపై ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా సీఐ సురేష్ బాబు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెడుతూ కొంతమంది గొడవలకు కారణమవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మోదమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డికి మోదమ్మ ఫొటోను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తికి స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి శివకిరణ్, మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యుడు తమర్భ ప్రసాద్‌నాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉప్పల వెంకటరత్నం, వీఆర్వో వెంకటలక్ష్మి ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం న్యాయమూర్తిని ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి, మోదకొండమ్మతల్లి ఫొటో, ప్రసాదాలను అందజేశారు.

సత్వరమే సమస్యల పరిష్కారం

- ఐటీడీఏ పీవో కావూరి చైతన్య



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పీవో కావూరి చైతన్య

చింతూరు: స్పందనలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 14 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

'మామిడి' దోస



మామిడి కాయలను పోలిన దోసకాయలు

పెదబయలు: మండల కేంద్రం పెదబయలులో ఓ గిరిజన మహిళ అమ్మకానికి తెచ్చిన దోసకాయలు అచ్చం మామిడి కాయల్లా ఉండడంతో స్థానికులు ఆసక్తిగా చూశారు. ముంచంగిపుట్టు మండలం మాలిపుట్టు గ్రామానికి చెందిన వంతాల రంభ ఇంటి పెరట్లో మామిడి కాయలను పోలిన ఈ రెండు దోసకాయలు కాశాయి.

ఆస్పిరేషనల్ బ్లాక్‌ఫెలో తుది ఫలితాలు విడుదల

సాక్షి, పాడేరు: నీతిఆయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్‌ఫెలో ఉద్యోగాల తుది ఫలితాలను బుధవారం కలెక్టర్ విడుదల చేశారు. పారదర్శకంగా ఈఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు 31వతేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఫలితాలను జిల్లా వెబ్‌సైట్‌లోనూ, కలెక్టర్ కార్యాలయం సీపీవో కార్యాలయం నోటీసు బోర్డులోను చూడవచ్చని తెలిపారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం శివారులోని బుధవారం ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఒకపక్క సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నాయని, మరోవక్క సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి రవాణా అవుతోందన్న సమాచారం మేరకు ఈ తనిఖీలు జరిపారు. సరిహద్దు ప్రాంతం నుంచి వచ్చిపోయే వాహనాల్లో రవాణా చేస్తున్న సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సిఆర్‌పిఎఫ్ డి42 బెటాలియన్ పోలీసులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

30న పాడేరులో 'సామాజిక సాధికారత' బస్సు యాత్ర



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికారత బస్సు యాత్ర ఈనెల 30న జిల్లా కేంద్రం పాడేరులో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరు మండలంలోని ముఖ్యనాయకులతో తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో గత నాలుగన్నర ఏళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా బస్సు యాత్ర జరుగుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. సామాజిక, సాధికారత బస్సు యాత్రపై గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి గ్రామం నుంచి గిరిజనులు పెద్ద ఎత్తున బస్సు యాత్రకు తరలివచ్చేలా పనిచేయాలని తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ప్రజలు ఆశీర్వదించే లక్ష్యంతో బస్సు యాత్ర జరుగుతుందని, పార్టీలోని స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలంతా విజయానికి కృషిచేయాలని భాగ్యలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్భ నరసింగరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సభ్యుడు సిరగం దశమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్ష,ఉపాధ్యక్షులు సీదరి రాంబాబు, పసుపుల సత్యనారాయణ, ఎస్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, ఎంపీటీసీలు గిడ్డి విజయలక్ష్మి, రామకృష్ణపాత్రుడు, చల్లా చిట్టమ్మ, నరసింహమూర్తి, సన్యాసిరావు, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, నీలకంఠం, వంతాల రాంబాబు, వంతాల సీతమ్మ, జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మోద బాబురావు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మినుముల కన్నాపాత్రుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు లకే రామసత్యవతి, కుంతూరు బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత 'సివిల్స్ శిక్షణకు' రెండో దశలో 156 మంది ఎంపిక

- 29, 30 తేదీల్లో ఇంటర్వ్యూలు
- ఐటీడీఏ పీవో అభిషేక్



సాక్షి, పాడేరు: ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రాజెక్టు లక్ష్య పేరుతో సివిల్ సర్వీసెస్ పరీక్షకు గిరిజన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతోందని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ బుధవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 23న నిర్వహించిన రెండో దశ స్క్రీనింగ్ పరీక్షకు 502 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 1:3 రేషియోలో ఇంటర్వ్యూలకు 156 మందిని ఎంపిక చేశామని చెప్పారు. ఈనెల 29, 30 తేదీల్లో ఐటీడీఏ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఐటీడీఏ కార్యాలయంలో హాలు టిక్కెట్లు జారీ చేస్తున్నామని చెప్పారు. ఇంటర్వ్యూలో ప్రతిభ చూపిన 50 మంది అభ్యర్థులను ఎంపిక చేసి నవంబర్ 1వ తేదీ నుంచి వేపగుంట వైటీసీలో శిక్షణ అందిస్తామన్నారు.

నేటి నుంచి టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

'చదువే వెలుగు' పేరిట 10వ తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేశామని, వారికి గురువారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నామని పీవో అభిషేక్ తెలిపారు. మండలంలోని దిగుమోదాపుట్టు, గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని పాల్గొన్నారు.

జెడ్పీ సీఈవోగా పోలినాయుడు



మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా ఎం.పోలినాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలినాయుడు గతంలో వి.మాడుగుల మండలం ఎంపీడీవోగా పని చేశారు. కొద్ది నెలల క్రితం డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో)గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు వద్ద ఓఎస్‌డీగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు సీఈవోగా చేసిన పి.శ్రీరామ్మూర్తిని మాతృశాఖ అయిన సహకార శాఖకు బదిలీ చేశారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. ఎంఎఎస్ మెరైన్ సర్వీస్, ఫ్లిప్‌కార్ట్, వరుణ్ మోటార్స్, ఎల్.వి.ప్రసాద్ ఐ ఆస్పత్రి, ముత్తూట్ ఫైనాన్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 295 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. పోర్ట్ సర్వేయర్స్, అసోసియేట్స్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ నర్స్, కెమిస్ట్, ట్రైనీ కెమిస్ట్, జూనియర్ ఆఫీసర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫార్మాసిస్ట్ తదితర ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18–45 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.13,000 నుంచి రూ.27,000ల వరకు ఉంటుందన్నారు.

పారిపోయాడనుకున్న డ్రైవర్ మృతి

- బొంతువలస వద్ద జరిగిన ప్రమాదంలో మరొకరు మృతి
- ప్రమాదం జరిగిన తరువాత డ్రైవర్ పారిపోయి ఉంటాడని భావించిన పర్యాటకులు
- కొడుకు కనిపించకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు
- పోలీసుల గాలింపుతో లభించిన మృతదేహం





మృతదేహం
(ఇన్‌సెట్) నానిబాబు (ఫైల్)

గూడెంకొత్తవీధి: మండలంలోని బొంతువలస వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతిచెందాడు. పర్యాటకులతో వచ్చిన వ్యాన్ ప్రమాదానికి గురవడంతో అందులో ప్రయాణిస్తున్న సాయితేజ(22) అనే యువకుడు మృతిచెందిన విషయం తెలిసిందే. ప్రమాదం తరువాత వ్యాన్ డ్రైవర్ మద్దేసు నాని బాబు (35) కనిపించకపోవడంతో భయంతో పారిపోయి ఉంటాడని అందరూ భావించారు. బుధవారం వరకు నానిబాబు కనిపించకపోవడంతో ఆయన తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పెదవలస అవుట్ పోస్టు పోలీసులు గాలింపు ప్రారంభించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో గల కాఫీతోటల వద్ద పెద్ద లోయ ఉంది. అక్కడ కూడా పోలీసులు గాలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి 50 మీటర్ల దిగువన నానిబాబు మృతదేహం లభించింది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

రాజవొమ్మంగిలో విషాదం

రాజవొమ్మంగి: బొంతువలస ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో రాజవొమ్మంగికి చెందిన మద్దేసు నానిబాబు (35) మృతి చెందడంతో స్థానికంగా విషాదం అలముకొంది. ప్రమాదం తరువాత నానిబాబు ఆచూకీ తెలియకపోవడంతో ఎక్కడో ఒక చోట ప్రాణాలతో ఉంటాడని భావించామని, అయితే ఇలా విగతజీవిగా మారుతాడని అనుకోలేదని బంధువులు రోదించారు. నానిబాబుకు భార్య, 6వ తరగతి చదువుతున్న కుమారుడు, వృద్ధురాలు అయిన అమ్మమ్మ ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

చింతూరు: ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు చింతూరు ఎస్‌ఐ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని చట్టిలో పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. బుధవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఒడిశా నుంచి ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లలను స్వాధీనం చేసుకుని బాలరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నరసారావుపేటలో హాల్ట్ తొలగింపు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు – గుంతకల్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల్లో భాగంగా సతులూర్ – నరసారావుపేట – మునుమాక స్టేషన్లలో రెండో లైన్ పనులు చేపడుతున్నందున ఈ మార్గంలో నడిచే పలు రైళ్లకు ఆయా తేదీల్లో నరసారావుపేటలో హాల్ట్‌ను తాత్కాలికంగా తొలగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ఈ నెల 26, 28, 30, 31న షాలిమార్ – వాస్కోడిగామా (18047) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26, 27, 29, 31, నవంబరు 2న వాస్కోడిగామా – షాలిమర్ (18048) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 26 నుంచి నవంబరు 2 వరకు భువనేశ్వర్ – బెంగళూరు – భువనేశ్వర్ (18463 /18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27న పూరీ – యశ్వంత్‌పూర్ (22883), 28న యశ్వంత్‌పూర్ – పూరి (22884) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 27న శ్రీ సత్యసాయి ప్రశాంతి నిలయం – హౌరా (22832) ఎక్స్‌ప్రెస్ నరసారావుపేటలో ఆగవు. ప్రయాణికులు మార్పులను గమనించాలని సూచించారు.

యువతిపై లైంగికదాడికి యత్నం

కోటవురట్ల: కె.వెంకటాపురానికి చెందిన ఓ యువతి తల్లిదండ్రులు భవానీమాలధారణతో ఈ నెల 23న విజయవాడకు వెళ్లారు. 24న యువతి చెల్లెలు నర్సీపట్నం వెళ్లగా, బాధిత యువతి ఇంట్లో ఒంటరిగా ఉంది. గ్రామానికి చెందిన సత్యనారాయణ సాయంత్రం 5 గంటల సమయంలో అత్యాచారానికి యత్నించాడు. ఆమె తప్పించుకుని బయటకు పరుగు తీసింది. తల్లిదండ్రులు విజయవాడ నుంచి వచ్చాక విషయం చెప్పడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

యువతిని వేధిస్తున్న యువకుడి అరెస్ట్

దొండపర్తి: యువతి ఫొటోను మార్ఫింగ్ చేసి వాట్సాప్ ద్వారా బెదిరింపులకు పాల్పడిన యువకుడిని సైబర్ క్రైం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నగరానికి ఒక యువతి ఫొటోను సోషల్ మీడియాలో యువకుడు సేకరించి పిక్స్ ఆర్ట్ అనే మొబైల్ యాప్‌లో మార్ఫింగ్ చేశాడు. ఫొటోను సదరు యువతి వాట్సాప్ నెంబర్‌కు పంపించాడు. తనకు డబ్బులు ఇవ్వకపోతే పోర్న్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తానని బెదిరించాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ దర్యాప్తు చేపట్టి సాంకేతికత సహాయంతో మార్ఫింగ్ ఫొటోలు పంపించింది కంచరపాలెం బర్మాక్యాంప్‌కు చెందిన డిల్లేష్(19)గా గుర్తించారు. దీంతో అక్కడిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

మెట్రో ముందడుగు

విశాఖ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మరో ముందడుగు. వచ్చే ఏడాది సంక్రాంతికి పునాది రాయి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సమగ్ర సర్వే నిర్వహించి.. రద్దీతో పాటు స్థలానికి అనుగుణంగా మెట్రో స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి.. ఎన్ని కిలోమీటర్ల పరిధిలో స్టేషన్ రావాలి.. వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ని సిద్ధం చేసింది. తొలి విడతగా కారిడార్–1ని పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపుదిద్దుకున్నాయి. ఈ కారిడార్‌లో స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 34.40 కి.మీ ట్రాక్ వెంబడి 29 స్టేషన్లు రానున్నాయి.



- తొలివిడతలో కారిడార్–1 పనుల ప్రారంభానికి సన్నాహాలు
- స్టీల్‌ప్లాంట్ నుంచి కొమ్మాది వరకు 29 స్టేషన్లతో 34.40 కి.మీ మేర ఏర్పాటు
- మద్దిలపాలెం డిపోని అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్టేషన్
- కొన్ని ప్రాంతాల్లో కి.మీ లోపే మెట్రో స్టేషన్ ఏర్పాటు

సాక్షి, విశాఖపట్నం : **పరిపాలన రాజధాని విశాఖలో మెట్రో రైల్ ప్రాజెక్టు పనులు త్వరితగతిన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం ప్రజలకు రవాణా సౌకర్యాలు భవిష్యత్తులో మెరుగుపరిచేందుకు మెట్రోపై దృష్టి సారించాలని** నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించేందుకు అడుగులు పడుతున్న తరుణంలో.. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉంది. మెట్రో రైలు రాకతో ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. అందుకే రెండు ఫేజ్‌ల్లో 76.9 కి.మీ మేర నాలుగు లైట్ మెట్రో కారిడార్లలో 54 మెట్రో స్టేషన్లు, రెండు డిపోలు ఏర్పాటు చేయనున్నారు. కారిడార్–1లో స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కి.మీ లైట్ మెట్రో ట్రాక్ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇందులో మొత్తం 29 స్టేషన్లు రానున్నాయి. ఇది వీలైనంత త్వరగా పూర్తి చేసి ట్రైన్లు నడిపించి ప్రజల్లో నమ్మకం కలిగించాలని భావిస్తున్నారు.

కారిడార్-1	స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకు 34.40 కి.మీ 29 స్టేషన్లు
కారిడార్-2	గురుద్వార్ నుంచి పాత పోస్టాఫీస్ వరకు 5.08 కి.మీ 6 స్టేషన్లు
కారిడార్-3	తాటిచెట్లపాలెం నుంచి ఆర్‌కే బీచ్ వరకు 6.75 కి.మీ 7 స్టేషన్లు
కారిడార్-4	కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు 30.67 కి.మీ 12 స్టేషన్లు

లైట్ మెట్రో ప్రాజెక్టు స్వరూపం ఇలా..

ప్రాజెక్టు విస్తీర్ణం
76.90 కి.మీ, **54** స్టేషన్లు

మొత్తం అంచనా వ్యయం
రూ.**14,309** కోట్లు

ఫేజ్-1లో కారిడార్-1, 2, 3 నిర్మాణానికి
రూ.**9,699** కోట్ల అంచనా వ్యయం

ఫేజ్-2లో కారిడార్-4 నిర్మాణానికి
రూ.**4,610** కోట్ల అంచనా వ్యయం



కారిడార్-1 (స్టీల్ ప్లాంట్ నుంచి కొమ్మాది జంక్షన్- 34.40 కి.మీ)

మెట్రో స్టేషన్ ఏర్పాటయ్యే ప్రాంతం	స్టేషన్‌కు స్టేషన్‌కు మధ్య దూరం(కి.మీ.లో)	మెట్రో స్టేషన్ ఏర్పాటయ్యే ప్రాంతం	స్టేషన్‌కు స్టేషన్‌కు మధ్య దూరం(కి.మీ.లో)
స్టీల్‌ప్లాంట్ ఆర్చ్	ప్రారంభం	ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	1.15
వడ్లపూడి	1.00	కంచరపాలెం	1.37
శ్రీనగర్ కాలనీ	0.85	తాటిచెట్లపాలెం	1.50
చినగంట్యాడ	0.80	అక్కయ్యపాలెం	0.74
గాజువాక	2.00	గురుద్వారా	0.90
ఆటోనగర్	1.00	మద్దిలపాలెం	2.34
బీహెచ్‌పీవీ జంక్షన్	1.20	ఇసుకతోట	0.70
షీలానగర్	1.10	వెంకోజీపాలెం	0.77
ఎయిర్‌పోర్టు	2.7	హనుమంతువాక	1.43
కాకాని నగర్	1.20	ఆదర్శనగర్	1.02
ఎన్‌ఏడీ జంక్షన్	0.90	జూపార్క్	1.01
జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా	1.60	ఎండాడ	2.43
మురళీనగర్	1.06	క్రికెట్ స్టేడియం	0.74
		శిల్పారామం	0.97
		మధురవాడ	1.33
		కొమ్మాది జంక్షన్	1.02



మద్దిలపాలెం వద్ద రానున్న ఇంటిగ్రేటెడ్ స్టేషన్

కారిడార్-1లో 29 స్టేషన్లు

స్టీల్‌ప్లాంట్ గేట్ నుంచి కొమ్మాది జంక్షన్ వరకూ మొదటి కారిడార్‌గా, గురుద్వార్ నుంచి పాత పోస్టాఫీస్ వరకూ కారిడార్–2, తాటిచెట్లపాలెం నుంచి ఆర్‌కే బీచ్ వరకూ కారిడార్–3, కొమ్మాది జంక్షన్ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ కారిడార్–4గా విభజించారు. తొలి కారిడార్ 34.40 కి.మీ మేర ఉన్న నేపథ్యంలో మొత్తం 29 స్టేషన్లు రానున్నాయి. తొలి మెట్రో స్టేషన్ కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే రానుంది. చాలా ప్రాంతాల్లో కిలోమీటర్ కంటే తక్కువ దూరంలోనే స్టేషన్ ఏర్పాటు కానుంది.

అదేవిధంగా.. మద్దిలపాలెం డిపోని మెట్రో రైల్ స్టేషన్‌ని అనుసంధానం చేస్తూ ఇంటిగ్రేటెడ్ స్టేషన్ ఏర్పాటు కానుంది.

నీతి ఆయోగ్ ఏబీ ఫెలోగా ఏయూ పరిశోధకురాలు

ఏయూక్యాంపస్: భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ యాస్పిరేషనల్ బ్లాక్ ఫెలోగా ఏయూ బయోకెమిస్ట్రీ విభాగం పరిశోధకురాలు బాతా హెప్సిబా వినీల ఎంపికయ్యారు. ఈ మేరకు ఆమెకు బుధవారం అధికారిక ఉత్తర్వులు అందాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వై.రామవరం మండలానికి యాస్పిరేషనల్ బ్లాక్స్ ఫెలో(ఏబీఎఫ్)గా వినీల సేవలందిస్తారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏబీఎఫ్‌గా ఎంపికైన వారికి నెలకు రూ.55 వేలు స్టైపెండ్ అందిస్తారు. వారు తమకు కేటాయించిన మండలం సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తారు. స్థానిక ప్రజలకు వర్క్‌షాపులు, అవగాహన సదస్సులు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పిస్తారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నీతి ఆయోగ్ నుంచి అందిస్తుంది. దేశవ్యాప్తంగా మొత్తం 500 యాస్పిరేషనల్ బ్లాకులను ఎంపిక చేయగా.. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 15 బ్లాక్‌లు ఉన్నాయి.



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న హెప్సిబా వినీల

పలురైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్‌లో ప్రయాణించే పలు ప్రయాణికుల రైళ్ల ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- విశాఖపట్నంలో ఈ నెల 25న బయల్దేరిన విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో 26న కిరండూల్ – విశాఖపట్నం (18513)ఎక్స్‌ప్రెస్ కిరండూల్‌లో నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- హౌరాలో ఈ నెల 25న బయల్దేరిన హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 26న జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి కాకుండా టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.
- భువనేశ్వర్‌లో ఈ నెల 25న బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడిచింది. తిరుగు ప్రయాణంలో 26న జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448)ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి కాకుండా కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.

సివిల్ సప్లయిస్ కమిషనర్ రాక నేడు

మహారాణిపేట: రాష్ట్ర సివిల్ సప్లయిస్ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ గురువారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి విమానంలో గురువారం సాయంత్రం 4.10 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి నేరుగా ప్రభుత్వ అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రికి అక్కడ బస చేస్తారు. శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

సత్తా చాటిన అహానా, భవేష్

విశాఖ స్పోర్ట్స్: జోనల్ స్థాయి సీబీఎస్‌సీ క్లస్టర్ 7 మీట్‌లో భాగంగా నిర్వహించిన పోటీల్లో అహానా, భవేష్ సత్తా చాటారు. షూటింగ్ పోటీల్లో అహానా రాతి విజేతగా నిలిచి, జాతీయ స్థాయి సీబీఎస్‌సీ క్లస్టర్ మీట్‌కు అర్హత సాధించింది. నేవీ స్కూల్‌కు చెందిన బాలుర అండర్–19 ఫుట్‌బాల్ జట్టు విజేతగా నిలవగా.. భవేష్ ఉత్తమ గోల్‌కీపర్‌గా నిలిచాడు. బాలుర బాస్కెట్‌బాల్ జట్టు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది.

రూ.100 కోట్లతో క్లినికల్ అండ్ బయో మెడికల్ సెంటర్

- ఉప రాష్ట్రపతి చేతులమీదుగా శంకుస్థాపనకు సన్నాహాలు
- సెంటినరీ పైలాన్ ప్రారంభం

మహారాణిపేట: భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పర్యటన ఖరారు కావడంతో.. ఆయన చేతుల మీదుగా పలు కార్యక్రమాలు చేపట్టడానికి ఆంధ్రా మెడికల్ కాలేజీ సన్నాహాలు చేస్తోంది. రూ.50 లక్షలతో నిర్మిస్తున్న సెంటినరీ పైలాన్‌ను ఉప రాష్ట్రపతి ప్రారంభించనున్నారు. అమెరికాలో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థుల సహకారంతో రూ.20 కోట్ల వ్యయంతో క్లినికల్ అండ్ బయో మెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం రూ.100 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టుకు అమెరికాలో స్థిరపడ్డ వైద్యులు తొలి విడతగా రూ.20 కోట్లు అందించినట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ నిధులతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, త్వరలో పనులు మొదలు పెడతామన్నారు. అలాగే ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించ నున్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) మంజూరైంది. రూ.25 కోట్ల నిర్మించనున్న ఈ బ్లాక్‌ను ఈ నెల 27న కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి మన్సుఖ్ ఎల్.మాండవియా వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు విడుదల చేస్తాయి. మార్చురీ ఎదురుగా ఈ బ్లాక్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఏఎంసీ వర్గాలు తెలిపాయి.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్రగాయాలు





తీవ్రంగా గాయపడిన పండయ్య, చినకొండబాబు

జి.మాడుగుల: మండలంలోని నుర్మతి రోడ్డులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో నుర్మతి పంచాయతీ కరకదాటు గ్రామానికి చెందిన మాతే పండయ్య, భీరం పంచాయతీ అనర్బ గ్రామానికి చెందిన కొఠారి చినకొండబాబులు బుధవారం ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ కంబాలుబయలు గ్రామ సమీపంలో ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులకు కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు 108 వాహనం వచ్చి గాయపడిన ఇద్దరిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది.

ఎటపాక: ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. భద్రాచలం నుంచి 12 మంది ప్రయాణికులతో ఉన్న ఆటో గన్నవరం వేపు వస్తోంది. అదే సమయంలో ఓ కారు కూనవరం నుంచి భద్రాచలం వెళ్తోంది. నెల్లిపాక హైవే బైపాస్ జంక్షన్ వద్ద ఈ రెండూ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో పల్టీ కొట్టగా, ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిలో గౌరీపేటకు చెందిన యన్నం అచ్చమ్మ, కరి మంగమ్మ, పత్తి సుశీలకు కాళ్లు, చేతులు విరిగాయి. అచ్చమ్మను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లారు.



ప్రమాదానికి గురైన కారు, ఆటో

నయా సైబర్ మోసం

- విద్యుత్ బిల్లు కట్టలేదని వ్యక్తికి మెసేజ్
- నిజమని నమ్మడంతో రూ.3లక్షలు టోకరా
- సైబర్ క్రైంకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- దర్యాప్తు చేసి డబ్బులు తిరిగి ఇప్పించిన పోలీసులు

దొండపర్తి: నగరంలో ఓ వ్యక్తికి విద్యుత్ బిల్ అప్డేట్ కాలేని, కనెక్షన్ కట్ అవుతుందని.. ఈ నంబర్‌కు కాల్ చేయండి అంటూ ఓ మెసేజ్ వచ్చింది. అది నిజమని నమ్మిన ఆ వ్యక్తి ఫోన్ చేసి వారు చెప్పిన విధంగా చేయడంతో అతని బ్యాంక్ అకౌంట్‌లోని రూ.3లక్షలు డెబిట్ అయ్యాయి. దీంతో మోసపోయానని గ్రహించిన ఆ వ్యక్తి వెంటనే సైబర్ క్రైం పోలీసులు ఫిర్యాదు చేశాడు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు డీసీపీ–1 కె.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. బాధితుడి బ్యాంక్ స్టేటమెంట్ ద్వారా డబ్బులు ఎక్కడకు వెళ్లాయో తెలుసుకుని వారికి మెయిల్ ద్వారా మెసేజ్ చేయడంతో పాటు సదరు సంస్థ నోడల్ అధికారితో మాట్లాడి నగదును హోల్డ్ చేశారు. తర్వాత ఆ డబ్బు క్రోమా రిటైలర్‌కు వెళ్లినట్లు గుర్తించి వారిని సంప్రదించగా, ఆ సంస్థ లావాదేవీని పరిశీలించి అది ఫ్రాడ్‌గా గుర్తించింది. దీంతో ఆ నగదును మళ్లీ బాధితుడి ఖాతాకు బదిలీ చేసింది. విద్యుత్ కనెక్షన్ రద్దు అవుతుందని, బిల్లు అప్డేట్ కాలేదని మెసేజ్ వస్తే నమ్మవద్దని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ ప్రజలకు సూచించారు.

యువతి ఆత్మహత్య

చింతపల్లి: మండలంలోని బౌర్తికి చెందిన గిరిజన యువతి సూ కూరు జయంతి (16) మంగళవారం ఆత్మ హత్య చేసుకుంది. ప్రేమ వ్యవహారంలో తల్లిదండ్రులు మందలించడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు అన్నవరం ఎస్‌ఐ రమణ తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



జయంతి (ఫైల్)

విహార యాత్రలో విషాదం

- రైవాడ జలాశయంలో కలాసీ గల్లంతు
- బోటు బోల్తా పడటంతో ప్రమాదం
- సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు

స్నేహితుల విహార యాత్ర ఓ కుటుంబంలో విషాదం నింపింది. సరదాగా రైవాడ జలాశయాన్ని చూసొద్దామని వీరు వెళ్లగా, అక్కడ బోటు బోల్తా పడి ఒకరు గల్లంతు కాగా, ఐదుగురు సురక్షతంగా బయటపడ్డారు. ఈ విషాద ఘటన దేవరాపల్లిలో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది.

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో బోటు బోల్తా పడిన ఘటనలో కలాసీ గల్లంతయ్యాడు. సబ్బవరం మండలం బలుసుపాలేనికి చెందిన రొంగలి సత్తిబాబు (38) తన ఆరుగురు స్నేహితులతో కలిసి జలాశయానికి విహారయాత్రకు వచ్చి ఈ ప్రమాదానికి గురయ్యాడు. సబ్బవరంలో కలాసీగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్న సత్తిబాబుతోపాటు గండిబోయిన నూకరాజు, చల్లా రాము, శానాపతి అప్పలనాయుడు, గొంప శ్రీను, లెక్కల గంగునాయుడు దసరా వేడుకను పురస్కరించుకుని జలాశయం సందర్శనకు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. అక్కడ పరిసరాల్లో సరదాగా గడిపిన వీరంతా మధ్యాహ్నం అక్కడే కలిసి భోజనం చేశారు. అప్పటి వరకు అందరితో సరదాగా గడిపిన సత్తిబాబు ఒడ్డున నిలిపి ఉన్న బోటు (చేపల బోటు) ఎక్కి జలాశయంలోకి వెళ్లే ప్రయత్నం చేశాడు. దీంతో ఒక్కసారిగా బోటు బోల్తా పడటంతో అందులో మునిగిపోయాడు. అందరూ చూస్తుండగానే మునిగిపోవడంతో మిగిలిన వారంతా చేసిన ప్రయత్నాలన్నీ ఫలించలేదు. తమతోపాటు వచ్చి జలాశయంలో మునిగిపోయిన సహచర కలాసీ ఆచూకీ కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో అదేరోజు సాయంత్రం దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలకు దిగినట్లు ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు.



రొంగలి సత్తిబాబు(ఫైల్)

సబ్బవరం మండలం బలుసుపాలెంలో విషాద ఛాయలు

గల్లంతైన సత్తిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భవానీ మాలధారణ దీక్ష పూర్తి చేసుకున్న కుమారుడిని తన భార్యతో కలిసి బుధవారం ఉదయం విజయవాడ దుర్గాదేవి దర్శనానికి సాగనంపాడు. అనంతరం సహచర కలాసీలతో కలిసి జలాశయం వద్ద సరదాగా గడిపేందుకు వచ్చిన సత్తిబాబు గల్లంతవ్వడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.